సాక్షి మెదక్

శుక్రవారం । 9 । జూన్ । 2023



తల్లీకొడుకు మృతి
పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో అనుమానాస్పద స్థితిలో ఓ తల్లీకొడుకు మృతి చెందారు. వీరు మహారాష్ట్ర నుంచి వలస వచ్చారు. 8లో

ప్రాణం తీసిన బంగారు గొలుసు
బంగారు గొలుసు విషయంలో భర్త వేధించాడంటూ ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయిన రోజు నెలరోజులకే నవవధువు తనువు చాలించింది. 8లో





చేపలు తెచ్చిన పంచాయితీ 8లో
మృగశిర కార్తె సందర్భంగా చేపలు పట్టే విషయమై నాగారం ఉమ్మాపూర్ మత్స్యకారుల మధ్య వివాదం నెలకొంది.

న్యూస్‌రీల్

రైతుల సమస్యలు పరిష్కరించాలి



చిట్కుల్ కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న మురళీయాదవ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): కొద్దిరోజులుగా ధాన్యం కొనుగోళ్లు జరగక, జరిగినా తూకంలో, లారీలు నింపడంలో, మిల్లర్లు దోచుకోవడంలో ప్రతి విషయంలో రైతులకు అన్యాయం జరుగుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా రైతులు కల్లాలలో పడిగాపులు కాస్తుంటే బీఆర్ఎస్ నేతలు దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం ఎంతవరకు సమంజమన్నారు. ఎమ్మెల్యే, నాయకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేసి, రైతుల ఖాతాలో డబ్బులు వేయించాలన్నారు. పలు గ్రామాల్లోని చెరువుల్లో మట్టిని అమ్ముకుంటున్నాపట్టించుకోని ప్రభుత్వం, చెరువుల పండగ చేయడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు నాగేష్, సత్యం పాల్గొన్నారు.

పల్లె దవాఖానాల నిర్మాణాలు త్వరలో పూర్తి



చిలప్‌చెడ్‌లో పల్లె దవాఖానా నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలో చేపట్టిన మూడు పల్లె దవాఖానాల నిర్మాణాలను పది రోజులలో పూర్తి చేసి, వాటిని ప్రారంభిస్తామని టీఎస్ఎంఎస్ఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) జిల్లా డిప్యూటీ డీఈ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన చిలప్‌చెడ్, ఫైజాబాద్, చిట్కుల్ గ్రామాల్లోని పల్లె దవాఖనాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవడానికి పల్లె దవాఖానాల నిర్మాణ పనులు చేపట్టామని, రూ.39 లక్షలతో మూడు గ్రామాలలో నిర్మాణాలు చేపట్టామన్నారు. 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాని, త్వరలోనే భవనాల నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజల వైద్య సేవలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జిల్లా ఏఈ మహేష్, కాంట్రాక్టర్లు మధుసూదన్‌రెడ్డి, సత్యగౌడ్‌లు పాల్గొన్నారు.

74 రోజులకు చేరిన దీక్షలు



దీక్షలో మొబైల్ దుకాణాల సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనకోసం రామాయంపేటలో నిర్వహిస్తున్న దీక్షలు గురువారం నాటికి 74 రోజులకు చేరుకున్నాయి. ఆందోళనలో భాగంగా 48 గంటల పట్టణ బంద్‌కు అఖిలపక్షం ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్ర, శనివారాల్లో పూర్తి బంద్ పాటించి తమకు సహకరించాలని వారు పిలుపునిచ్చారు. ఈమేరకు వారు దుకాణాల్లో, వ్యాపార సముదాయాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. దీక్షల్లో మొబైల్ దుకాణాల సంఘం ప్రతినిధులు కూర్చున్నారు.

అంతర్జాతీయ పోటీలకు గురుకుల విద్యార్థిని



కార్తీకను అభినందిస్తున్న రోనాల్డ్‌రాస్

తూప్రాన్: ఈ నెల 13 నుంచి 17 వరకు తైవాన్‌లో జరిగే ఆసియాకప్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత-15 బాలికల జట్టుకు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థిని ధరావత్ కార్తీక ఎంపికైందని ప్రిన్సిపల్ సద్గుణ మేరీగ్రేస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో హైదరాబాద్, అనంతపూర్‌లలో నిర్వహించిన శిక్షణ, ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జట్టుకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి రోనాల్డ్‌రోస్, జిల్లా ఆర్‌సీఓ బీమయ్యలు అభినందించారు.

నేటి నుంచి గొర్రెల పంపిణీ

- రెండో విడత అర్హులు: 7,230 మంది
- డీడీలు చెల్లించిన సభ్యులు: 2,600



పెరిగిన వాటాధనం

మెదక్‌జోన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం రెండవ విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. శుక్రవారం నుంచి లబ్ధిదారులకు సబ్సిడీ గొర్రెలు అందించనున్నారు. రెండోవిడతలో ఇప్పటివరకు 2,600 మంది సభ్యులు మాత్రమే తమ వాటాధనం చెల్లించారు.

- మెదక్ జిల్లాలో 343 గొర్రెల పెంపకందారుల సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 20,227 సభ్యులు ఉన్నారు. 2017లో మొదటివిడతలో భాగంగా 12,997 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసి సబ్సిడీ గొర్రెలు అందించారు. మిగిలిన 7,230 మందికి రెండవ విడతలో అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.
- మొదటి విడత గొర్రెల పంపిణీ జరిగిన వెంటనే రెండవ విడత కూడా చేస్తారనే ఉద్దేశంతో లబ్ధిదారులు తమ వాటాధనం కింద డీడీలు తీసి అధికారులకు అందజేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన వారిలో కొందరు తమ డీడీలు వెనక్కి తీసుకున్నారు.
- రెండో విడత గొర్రెల పంపిణీ సమయానికి ఒక్కో లబ్ధిదారుడి చెల్లించాల్సిన వాటాధనం రూ. 12,500లకు పెరిగింది.
- 2017లో 20 గొర్రెలు, ఒక పొట్టేల్ కలిపి యూనిట్ ధర రూ.1.25 లక్షలు కాగా, అందులో 25శాతం లబ్ధిదారుడి వాటా కింద రూ.31,250 చెల్లిస్తే మిగతా రూ.93,750 సబ్సిడీ కింద ప్రభుత్వం భరించింది.
- ప్రస్తుతం యూనిట్ ధర రూ. 1.75 లక్షలకు పెరిగింది. మొదటి విడతతో పోల్చితే రూ.50,000 అదనం. ఈ లెక్కన 25% లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 చెల్లిస్తే మిగతా రూ. 1,31,250 సబ్సిడీ కింద ప్రభుత్వం భరించనుంది.

2,600 మంది సభ్యులే...

సబ్సిడీ గొర్రెలు అందని సభ్యులు జిల్లాలో 7,230 మంది ఉండగా, ఇందులో 2600 మంది మాత్రమే తమ వాటాధనం డీడీల రూపంలో చెల్లించారు. మిగతా 4,630 సభ్యులు ఇంకా డీడీ చెల్లించలేదు. ముందుగా డీడీలు చెల్లించిన వారికి శుక్రవారం నుంచి గొర్రెలు పంపణీ చేయనున్నారు.

కర్నూలులో దొరక్క..గుంటూరుకు

జిల్లాలోని లబ్ధిదారులకు ఏపీలోని కర్నూలు నుంచి గొర్రెలు తెప్పించి ఇవ్వాలని ముందుగా అధికారులు నిర్ణయించారు. అయితే అక్కడ గొర్రెలు అందుబాటులో లేదు. దీంతో గుంటూరు జిల్లాలో ప్రయత్నిస్తున్నారు. అక్కడ గొర్రెలు అందుబాటులో లేవు.

నియోజకవర్గానికి 12 యూనిట్లు



జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు 24 యూనిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 12 యూనిట్లు ఇస్తాం. గొర్రెలు దొరకని కారణంగా లబ్ధిదారులకు ముందుగా మంజూరు లెటర్లు ఇస్తాం. మరో పదిరోజుల్లో గొర్రెలు కొనుగోలు చేసి అందజేస్తాం.
– విజయశేఖర్‌రెడ్డి, వెటర్నరీ జిల్లా అధికారి



గోమారం చెరువు వద్ద నిర్వహించిన ఉత్సవాల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కాళేశ్వరంతో జలకళ

శివ్వంపేట(నర్సాపూర్): కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో జలకళ సంతరించుకుందని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధి గోమారం పెద్ద చెరువు వద్ద నిర్వహించిన చెరువుల పండగలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భం చెరువువద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి గంగతెప్ప, బోనాలు, బతుకమ్మ ఆటలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దూరదృష్టితో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి నీరు వదలడం వల్ల వేసవికాలంలో సైతం గ్రామ చెరువులు నిండుకుండలా ఉన్నాయన్నారు.కులవృత్తులకు ఉపాధి పుష్కలంగా దొరుకుతుందన్నారు. నీటి లభ్యత వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎసయ్య, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యామాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్‌-1 ప్రిలిమినరీ

- 3,293 మంది అభ్యర్థులు...7 కేంద్రాలు
- పరీక్ష కేంద్రంలోని మాస్ అనుమతి లేదు: కలెక్టర్ రాజర్షిషా



మెదక్ కలెక్టరేట్: ఈనెల 11న జరిగే గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో అధికారులకు సూచించారు. జిల్లాకు 3,293 మంది పరీక్ష రాయడానికి 7 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదివారం ఉదయం 10:30 నుంచి 1 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 10:15 గంటలకు వరకు చేరుకోవాలని, ఒక నిమిషం ఆలస్యమైనా ఎవరినీ లోపలికి అనుమతించవద్దని చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. అభ్యర్థులు చెప్పులతో మాత్రమే ఎగ్జామ్ సెంటర్‌కు రావాలని, షూస్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్, క్యాలిక్యులేటర్, వాచ్, బెల్ట్ తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెస్‌కు కూడా అనుమతి లేదన్నారు. అభ్యర్థులు తమ వెంట డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, ఫొటో గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌పై హాల్‌టికెట్ నంబర్, బుక్‌లెట్ నంబరు బ్లూ/బ్లాక్ బాల్ పెన్నుతో రాసేలా ఇన్విజిలేటర్లు చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర వసతులు కల్పించడంతోపాటు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.

20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ కలెక్టరేట్: బీసీ కుల, చేతివృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తుందని, అర్హులైన వారు ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయసు కలిగి, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలన్నారు. కుటుంబంలోని ఒకరికి మాత్రమే ఆర్థికసాయం అందజేస్తారన్నారు. ఐదు సంవత్సరాలలోపు ఏ ప్రభుత్వశాఖ ద్వారా ఆర్థిక లబ్ధి పొందిన వారై ఉండకూడదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆ దరఖాస్తు వెంట కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతపరచి సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాల యంలో ఈనెల 20వ తేదీలోగా అందజేయాలన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి సంబరాలు

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో సంక్షేమ సంబురాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ నియోజకవర్గ సమావేశం మాయగార్డెన్‌లో, నర్సాపూర్ నియోజకవర్గ సమావేశం శివ్వంపేట రోడ్ లోని చాముండేశ్వరి గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ పథకాల ద్వారా గ్రామాల వారీగా లబ్ధిపొందిన వివరాలు, అందించిన ఆర్థికసాయానికి ప్రగతి నివేదిక వివరించడంతో పాటు ప్రజాప్రతినిధులచే గ్రామీణ వృత్తి పనుల వారికి ఆర్థిక సాయం, గొల్ల కురుమలకు రెండవ విడత గొర్రెల పంపిణీ మంజూరు ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇంజనీర్ డిప్లొమా ప్రవేశాలపై అవగాహన సదస్సు

చేగుంట(తూప్రాన్): గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరానికిగాను ఇంజనీర్ డిప్లొమా ప్రవేశానికి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రవేశం గురించి అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ చక్రవర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13,14, 15వ తేదీల్లో 2023- పాలిసెట్ అవగాహన సదస్సు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల చేగుంటలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9177879955, 9000218235 నంబర్లలో సంప్రదించగలరు.

అనాథలను ఆదుకోని ప్రభుత్వం



ఆశ్రమంలో అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న మందకృష్ణ

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

శివ్వంపేట(నర్సాపూర్): ఆకలితో అలమటిస్తూ, ఆశ్రయం లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనాథలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో ఉన్న బేతాని అనాథ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథలకు పండ్లు పంపిణీ చేసి వారి గురించి ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్‌ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథలకు ఓటుహక్కు ఉండదు కాబట్టి ప్రభుత్వం, ప్రతిపక్షాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనాథలకు ప్రభుత్వం వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేపడుతున్నట్లు చెప్పారు. మగ్దుంపూర్ ఆశ్రమంలో అనాథలకు సేవలందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాసాయిపేట యాదగిరి, చెట్లపల్లి యాదగిరి తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు

గజ్వేల్ ఏసీపీ రమేశ్



విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ రమేశ్ తదితరులు

గజ్వేల్‌రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు, మందులు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. గురువారం సీఐ వీరప్రసాద్‌తో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని సీడ్స్, అండ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శివబాలాజీ ట్రేడర్స్‌లో 3 విత్తనాల ప్యాకెట్స్, 5రెడ్ గ్రామ్ ప్యాకెట్లను గుర్తించి వ్యవసాయ అధికారులకు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించినట్లు తెలిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 100కు లేదా పోలీస్ కమిషనరేట్ వాట్సాప్ నంబర్ 8712667100కు సమాచారం అందించాలన్నారు. టాస్క్‌ఫోర్స్ టీం ప్రాసెసింగ్ యూనిట్‌ను, కొడకండ్ల శహన సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో లేబుల్ లేని 1,600 విత్తన బస్తాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని గజ్వేల్ వ్యవసాయాధికారికి అప్పగించి, శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో గజ్వేల్ వ్యవసాయాధికారి నాగరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణలను సీజ్ చేస్తామని ఏసీపీ వాసాల సతీష్ అన్నారు. గురువారం పట్టణంలోని విత్తన దుకాణలను తనిఖీ చేశారు. విత్తన రకాలపై దుకాణ యజమానులకు మండల వ్యవసాయ అధికారి నాగరాజు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు సర్టిఫై చేసిన మందులు, ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కంపెనీ పేర్లు లేకుండా విత్తనాలు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతో సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐలు మహేశ్, వివేక్ ఉన్నారు.

మండుటెండలోనూ జల సవ్వడి



చెరువు వద్ద దండం పెడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా తదితరులు

ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

మెదక్ రూరల్: మండుటెండల్లోనూ చెరువులు నిండుకుండలా జలకళ సంతరించుకున్నాయని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండల పరిధిలోని కొంటూర్ చెరువువద్ద ఏర్పాటు చేసిన ఊరూరా చెరువుల పండగలో కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై బతుకమ్మ ఆడారు. కలెక్టర్‌తో కలిసి కట్టమైసమ్మ, గంగ పూజలు నిర్వహించి గంగకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్ కాకతీయ ద్వారా మెదక్ నియోజకవర్గంలో 484 చెరువుల్లో పూడికతీసి నీళ్ల నింపుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, నీటిపారుదల ఈఈ శ్రీనివాస్ రావు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు రజిని, ఆర్డీఓ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి స్థాయికి ఎదిగాం

- గణనీయంగా పెరిగిన చేపల ఉత్పత్తి
- ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో కలెక్టర్ రాజర్షిషా



వలలతో తరలివచ్చిన మత్స్యకారులతో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్

మెదక్ కలెక్టరేట్: గతంలో ఇతర రాష్ట్రాల నుంచి చేపల దిగుమతి ఉండేదని, నేడు చేపలను ఎగుమతి చేసే స్థాయికి మన రాష్ట్రం ఎదిగిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మెదక్ కలెక్టరేట్ ఆవరణలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను అదనపు కలెక్టర్లు ప్రతిమసింగ్, రమేష్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజర్షిషా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద వందశాతం సబ్సిడీ ఇవ్వడంతో చేపలు ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. జిల్లాలో ఊరూరా చెరువుల పండగను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను బాగు చేసుకొని, కాళేశ్వరం జలాలతో వాటిని నింపుకోవడం వల్ల చేపల పెంపకానికి అవకాశాలు పెరిగాయన్నారు. గతంలో జిల్లాలో 206 సంఘాలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 273కు పెరిగి 17,500 సభ్యులున్నారన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన భరత నాట్య ప్రదర్శనను తిలకించారు. మత్స్య, పాడి పరిశ్రమ, పశు సంవర్ధక శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను అధికారులు పరిశీలించారు. అంతకుముందు డిజిటల్ స్క్రీన్ పై మత్స్య ప్రగతిపై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకార్మికుల కుటుంబాలకు ప్రమాద బీమా ప్రొసీడింగ్ పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ సహాయ సంచాలకులు రజిని, పాడిపరిశ్రమ అధికారి శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖాధికారి విజయశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ రాజయ్య, డీఎస్‌డీఓ విజయలక్ష్మి, మత్స్య సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బీమా ప్రతాలు అందుకున్న మత్స్యకార కుటుంబీకులతో అధికారులు

క్లుప్తంగా

కత్తితో దాడి చేసిన వ్యక్తుల రిమాండ్

పాపన్నపేట(మెదక్): ఇంటి స్థలం వివాదంలో కత్తితో దాడి చేసిన వ్యక్తులను గురువారం రిమాండ్ చేసినట్లు పాపన్నపేట ఎస్ఐ విజయ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందిన పరవస్తు సంగమేశ్వర్ ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన పాపయ్యకు ఇంటి స్థలాన్ని విక్రయించాడు. కానీ రిజిస్ట్రేషన్ చేయలేదు. ఈ విషయంలో కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 4న పాపయ్య తన స్నేహితుడు మక్బూద్‌తో కలసి లక్ష్మీనగర్ శివారులో సంగమేశ్వర్‌పై కత్తితో దాడి చేయగా, అతని చేతికి గాయమైంది. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రాపురం మండల పరిధిలోని ఈదుల నాగులపల్లి సమీపంలో రెండు రోజుల క్రితం 30 నుంచి 40 ఏండ్ల వయస్సు కలిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులు కలసి గురువారం మృతదేహానికి పటాన్‌చెరులో అంత్యక్రియలు నిర్వహించారు.

చిన్నారి అదృశ్యం


ప్రియ (ఫైల్)

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఓ చిన్నారి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలగూడలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సితేందర్–సునీతాదేవి దంపతులు జీవనోపాధికి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండలగూడకు వలస వచ్చారు. వీరికి ముగ్గురు సంతానం, కాగా వీరు ఉదయం 9గంటలకు ఇంటి నుంచి కూలీ పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తారు. ఈ నెల 5వ తేదీన ఎప్పటిలాగే కూలీ పనులకు వెళ్లి వచ్చారు. ఆ సమయంలో రెండవ కుమార్తె 8 ఏళ్ల ప్రియ ఇంట్లో లేకపోవడంతో ప్రియ ఎక్కడ ఉందని కుమారుడిని అడగగా అతడు ఆడుకోవడానికి వెళ్లిందని సమాధానం ఇచ్చాడు. రాత్రి అయినా ప్రియ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ బ్రెయిన్‌డెడ్


లక్ష్మారెడ్డి(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ కానిస్టేబుల్ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. వివరాల్లోకి వెళితే...కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి(39) సోమవారం రాత్రి శివ్వంపేట్ స్టేషన్‌లో విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందతుండగా గురువారం లక్ష్మారెడ్డి బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్టు వైద్యులు ధృవీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం లక్ష్మారెడ్డి అవయవ దానం చేస్తామన్నారు. భార్య భవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

మల్లన్న ఆలయ తాత్కాలిక ఉద్యోగి...


కనకయ్య (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొడువటూరు గ్రామానికి చెందిన కనకయ్య(40) గురువారం మృతి చెందాడు. ఆలయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో విధులు నిర్వహించేందుకు తన గ్రామం కొడువటూరు నుంచి ద్విచక్ర వాహనంపై ఉదయం బయలుదేరి కొంతదూరం రాగానే బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అతని కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయ ఉద్యోగులు అధికారులు పరామర్శించి, 10వేల ఆర్థికసాయం అందజేశారు.

కారు ఢీకొని కూలీ ...


మల్లేశం (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంనగర్ వద్ద చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాన్నాల మల్లేశం(45) గురువారం రోడ్డు పక్కన నిలబడి పని విషయమై సర్పంచ్ సుభాష్, మరికొందరితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ కారు డ్రైవర్ నిద్రమత్తులో అదుపు తప్పిరోడ్డుపక్కన నిలబడి ఉన్న మల్లేశంపైకి దూసుకువచ్చింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతావారు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. మృతుడి భార్య ఎల్లవ్వ, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు రాజలింగం ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

పలువురికి గాయాలు


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ పుష్పరాజ్

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో వినాయక డిగ్రీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌కు చెందిన పెర్క రాజు సిద్దిపేట నుంచి ప్రజ్ఞాపూర్‌కు ఇద్దరు కొడుకులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ కారు అదుపుతప్పి మిషన్ భగీరథ పైప్‌లైన్ గద్దెను ఢీ కొట్టింది. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మూలమలుపు వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యపేట నుంచి నిర్మల్ వెళ్లాల్సిన కారు అక్కన్నపేట మండల కేంద్రంలో అదుపుతప్పి మూలమలుపు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ గద్దెను ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు స్వల్ప గాయాల పాలయ్యారు. ఈ మేరకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో పోలీస్ వాహనంలో యువకులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన కానిస్టేబుళ్లు రమేశ్, రాజ్ కుమార్, కృష్ణలను స్థానికులు అభినందించారు.

కంసాని కుంట పూడ్చితే చర్యలేవీ?

- అర్ధరాత్రి టిప్పర్లతో మట్టి తరలింపు
- అడ్డుకున్న రైతులు, పోలీస్‌స్టేషన్‌కు టిప్పర్ తరలింపు


పోలీసు స్టేషన్‌కు తరలించిన టిప్పర్

హుస్నాబాద్‌రూరల్: మండలపరిధిలోని పోతారం (ఎస్)లో కంసాని కుంటకు మిషన్ కాకతీయలో రూ.35లక్షల వ్యయంతో మరమ్మతులు చేయించారు. కొందరు రియల్ వ్యాపారులు కుంటను పూడ్చి వెంచర్ వేయడానికి ప్రయత్నం చేస్తుంటే రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారించిన అధికారులు సదరు వ్యక్తిని హెచ్చరించడంతో కొద్ది రోజులు పనులను నిలిపివేశారు. మళ్లీ బుధవారం అర్ధరాత్రి సదరు వ్యాపారి సిద్దిపేట నుంచి టిప్పర్లను తీసుకొచ్చి కుంటను పూడ్చివేసే పనులు చేయడంతో రైతులు విషయం తెలుసుకొని రాత్రి కుంట దగ్గరకు వెళ్లి పనులను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు రాకపోవడంతో 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి పనులు నిలిపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి అక్కడే టిప్పర్లు ఉండగా వాటిని ఉదయం యజమానులు వచ్చి తీసుకెళ్లగా ఒక టిప్పరు ఉంటే రైతులు దానిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించారు. గురువారం తహసీల్దార్‌ను కలిసి కుంటను పూడ్చిన రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు రైతులు తెలిపారు. ఊర శివారులోని కుంటలు మొత్తం కనుమరుగువతున్నాయని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వ భూములను అక్రమ వెంచర్లలో కలుపుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

తల్లీకొడుకు అనుమానాస్పద మృతి


ముక్రాబాయి మృతదేహం


ఉత్తమ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పదంగా ఓ తల్లీకొడుకు మృతి చెందారు. పటాన్‌చెరు పోలీస్ స్టే సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన ముక్రాబాయి సత్వాజీ కాంబ్లే ఆమె కుమారుడు ఉత్తమ్ సత్వాజీ నాగప్ప కాంబ్లే పదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి మండల పరిధిలోని రుద్రారంలో నివాసం ఉంటున్నారు. ఉత్తమ్ స్థానికంగా ఉన్న తోషిబా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం ఇంటి తలుపులు తెరవకపోవడంతో చుట్టూ పక్కల వారు అనుమానం వచ్చి వారు ఉంటున్న గదికి వెళ్లి చూసేసరికి ఇద్దరూ చనిపోయి ఉన్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లీకొడుకు ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారా, లేదా ఏ ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు తెచ్చిన పంచాయితీ


బైరోని చెరువు వద్ద ఆందోళన చేస్తున్న నాగారం మత్స్యకారులు

హుస్నాబాద్‌రూరల్: మృగశిర కార్తె సందర్భంగా చేపలు పట్టే విషయమై రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం నాగారం మత్స్యకారులు బైరోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఉమ్మాపూర్ మత్స్యకారులు వారిని బయటకు రాకుండా చెరువు గట్టుపై కర్రలు పట్టుకొని నిలబడ్డారు. చెరువులో చేపలు పట్టుకునే హక్కుపై రెండు గ్రామాల మధ్య కొద్దిరోజులుగా వివాదం జరుగుతోంది. విషయం ఈ కోర్టు వరకు వెళ్లడంతో కోర్టు స్టే విధించింది. కాగా మృగశిరకార్తె కావడంతో నాగారం మత్స్యకారులు చెరువు వద్దకు వచ్చి చేపలు పట్టేందుకు రాగా ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ఉమ్మాపూర్ మత్స్యకారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముదిరాజ్‌లు, గంగపుత్రులకు మధ్య వాగ్వాదం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని పాండవుల చెరువు వద్ద చేపలు పట్టే వ్యవహారంలో ముదిరాజ్‌లు, గంగపుత్రులకు మధ్య పంచాయితీ నెలకొంది. కొన్నేళ్లుగా సొసైటీ సభ్యులుగా ఉన్న ముదిరాజ్‌లు చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో గంగపుత్రులు నూతన సొసైటీలో సభ్యులుగా ఏర్పడి తమకు కూడా పాండవుల చెరువులో చేపలు పట్టేందుకు హక్కులున్నాయంటూ ముందుకొచ్చారు. దీంతో ఇరువర్గాలకు చేపలు పట్టే విషయంలో పంచాయితీ నెలకొంది. ఈ క్రమంలో గురువారం గంగపుత్రులు చెరువులో చేపలు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ముదిరాజ్‌లు అక్కడికి చేరుకొని చేపలు పట్టేవారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను 'సీఈఐఆర్' టెక్నాలజీతో స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు స్థానిక ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రానికి చెందిన తిగుళ్ల సత్యనారాయణ అనే వ్యక్తి తన రెడ్మీ కంపెనీ సెల్‌ఫోన్‌ను ఈ నెల 1వ తేదీన పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశాడు. ఫోన్ దొరికిన వ్యక్తి ఫోన్‌లో సిమ్ కార్డు వేయగానే పైవెబ్‌సైట్ ద్వారా అతని వివరాలు స్థానిక పోలీసులకు చేరాయి. వెంట నే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించినట్లు తెలిపారు. ఎవరైతే ఫోన్ పోగొట్టుకుంటా రో వారు వెంటనే ప్రభుత్వం నూతనంగా తెచ్చిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేసి తద్వారా తిరిగి పొందవచ్చన్నారు

వాకింగ్‌కు వెళ్లి కిందపడి వృద్ధుడు..

పటాన్‌చెరు టౌన్: వాకింగ్‌కు వెళుతూ కిందపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. పట్టణంలోని ప్రణీత్‌ప్రణవ్ పనోరమ కాలనీలో ఉండే వైఎస్ రాంరెడ్డి (75) గురువారం ఉదయం 9గంటల సమయంలో వాకింగ్ వెళ్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత కిందపడి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు అక్కడి నుంచి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు..


భాస్కర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. రామాయంపేట తండాకు చెందిన గుగ్లోత్ భాస్కర్ (30) బైక్‌పై కాట్రియాల వెళ్లి తిరిగి వస్తుండగా, లక్ష్మాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతడి చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం చోటుచేసుకున్న పలు సైబర్ నేరాల గురించి సీపీ తెలిపారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట...

సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి పార్ట్ టైం ఉద్యోగం ఉందంటూ వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో కమీషన్ వస్తుందని ఆశపడి అందులో సూచించిన ప్రకారం వివరాలు నమోదు చేశారు. రూ.24,700 పెట్టుబడిగా పెట్టి ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందన రాలేదు.

ఇన్సూరెన్స్ పేరుతో టోకరా..: గజ్వేల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో హెల్త్ ఇన్సూరెన్స్ గురించి వెతికాడు. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి హెల్త్ ఇన్సూరెన్స్ నుంచి మాట్లాడుతున్నాం. మేము పంపే లింకులో వివరాలు నమోదు చేయాలని, తర్వాత డాక్టర్ ఫోన్ చేస్తాడని సూచించాడు. నమ్మిన బాధితుడు లింకులో వివరాలు నమోదు చేసి, డెబిట్ కార్డు వివరాలు తెలిపాడు. దీంతో ఖాతా నుంచి రూ.9,244 డెబిట్ కావడంతో మోసపోయాడు.

స్క్రాచ్ కార్డ్ పేరుతో..

గజ్వేల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి పేటీఎం రివార్డు స్క్రాచ్ కార్డ్ పేరుతో మెసేజ్ వచ్చింది. ఓపెన్ చేయగా సెండ్ మనీ ఆప్షన్ రాగా బాధితుడు తన యూపీఐ నంబర్ ఎంటర్ చేశాడు. దీంతో ఖాతా నుంచి రూ.1,999 డెబిట్ అయింది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి..

పటాన్‌చెరు టౌన్: పార్ట్ ఉద్యోగం పేరుతో వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.2.67 లక్షలు మోసపోయారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులురెడ్డి కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని ఆర్ఆర్ హోమ్స్‌లో ఉండే ఓ వ్యక్తికి మే 9వ తేదీన పార్ట్‌టైం ఉద్యోగం అంటూ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసి మూడు విడతలుగా రూ.95 వేలు డబ్బులు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. రెట్టింపు డబ్బులు ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి ఈ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో..

మండల పరిధిలోని పటేల్‌గూడలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఈ నెల 2వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం అంటూ మెసేజ్ వచ్చింది. ఓపెన్ చేసి ఐదు విడతలుగా రూ.1.72లక్షలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. టాస్కులు పూర్తి చేసినా డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి గురువారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు.


అనాథలైన పిల్లలు

బావిలో దూకి మహిళ


యాదమ్మ (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రాంసాగర్ గ్రామంలో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాదమ్మ (30) భర్త స్వామితో ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి యాదమ్మ ఇద్దరు పిల్లలు బాను, బన్నితో కలిసి తల్లి ఎల్లమ్మ వద్ద ఉంటూ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. గురువారం ఇంటి వెనుక బావిలో శవమై కనిపించింది. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకుని ఉంటుందని స్థానికులు తెలిపారు. తల్లిదండ్రుల మృతితో పదేళ్లలోపు పిల్లలు అనాథలయ్యారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ చంద్రమోహన్ యాదవ్ తెలిపారు.

తాను ఉంటున్న గదిలోనే....


కామాంద్రి అనిల్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కామాంద్రి అనిల్(22) రెండేళ్లుగా హైదరాబాద్‌లో ఓ రిసార్ట్‌లో పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తాను ఉంటున్న గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రిసార్ట్ నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కుమారుడి మృతిపై తండ్రి వెంకటస్వామి అనుమానం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

తల్లి మందలించిందని...


సత్యనారాయణ(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): తల్లి మందలించిందని ఓ కొడుకు మంజీరా వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మండల పరిధిలోని చాముండేశ్వరీ ఆలయ పరిధిలోని మంజీరా వాగులో శవం కనబడింది. దీంతో పోలీసులు ఈ శవాన్ని వెలికితీయించారు. ఏఎస్ఐ మిస్బావుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బండపోతుగల్ గ్రామానికి చెందిన తలారి సత్యనారాయణ(27) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. దీంతో అతని తల్లి లచ్చమ్మ మే నెల 28న ఎన్ని రోజులు ఇంట్లో ఖాళీగా ఉంటావని, ఏదైనా పని చేసుకో అని కొడుకును మందలించగా, ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజులు బంధువులు, సన్నిహితుల వద్ద ఆరా తీసినా ఆచూకి దొరకకపోవడంతో 30న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ రోజు శుక్రవారం వాగులో మృతదేహం దొరకడంతో, మృతుడు సత్యనారాయణగా గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మనస్తాపంతో వివాహిత ...

తూప్రాన్: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని వెంకటాయపల్లిగ్రామానికి చెందిన బండకాడి సత్యమ్మ పెద్ద కూతురు సునీతను అదే గ్రామానికి చెందిన శివ్వంపేట స్వామిగౌడ్‌కు 20 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి 12 సంవత్సరాల కుమారుడున్నారు. కుటుంబ విషయంలో దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయని మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే బుధవారం రాత్రి భార్యభర్త ఆర్థిక ఇబ్బందులతో గొడవ పడగా సునీతా(36) ఇంట్లోకి వెళ్లి తలుపులకు గడియ వేసుకుందన్నారు. ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో, చుట్టు పక్కల సాయంలో తలుపులు పగలగొట్టి చూడగా ఇంటి పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి గొడవలే కారణమని, తల్లి సత్యమ్మ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ కృష్ణ

దుబ్బాకరూరల్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు దుబ్బాక సీఐ కృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అక్బర్‌పేటభూంపల్లి మండలం శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో వారం రోజుల క్రితం హుండీని పగులగొట్టి డబ్బులను చోరీ చేశారు. ఆలయ పూజారి సాంకేత్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన రావుల రాజు, కంపె మల్లేశంగా గుర్తించారు. వీరిద్దరు రామాయంపేట, మెదక్, భూంపల్లి పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారని, వీరి నుంచి టీవీఎస్ ఎక్సెల్, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమమంలో భూంపల్లి ఎస్ఐ గంగరాజు పాల్గొన్నారు. దొంగలను పట్టుకున్న కానిస్టేబుళ్లు సాయికృష్ణ, రాజిరెడ్డిని సీఐ అభినందించారు.

ప్రమాదకరంగా హోర్డింగ్‌లు


విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నుంచి కొల్లూర్ వెళ్లే రేడియల్ రోడ్డును ఆనుకొని ఇష్టానుసారంగా హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఈదురుగాలులు వచ్చినప్పుడు హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు చినిగి విద్యుత్‌తీగలు, రోడ్లపై పడటంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇష్టానుసారంగా హోర్డింగ్‌లకు అనుమతులు ఇవ్వడం వలనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణం తీసిన బంగారం గొలుసు

పెళ్లయిన నెలరోజులకే..


అఖిల (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): అగ్నిసాక్షిగా పెళ్లి జరిగి నెలరోజులే అయ్యింది. చిన్న బంగారం గొలుసు పోయిందని భర్త పంచాయితీతో ఆమె మనోవేదనకు గురైంది. ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ రేకుల ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... సదాశివ పేట మండలం రేండ్లపల్లి గ్రామానికి చెందిన కొలుకూరి లక్ష్మి కూతురు అఖిల (19) వివాహం హత్నూర మండలం పన్యాల గ్రామానికి చెందిన నీరుడి భాగయ్యతో గత నెల ఏడో తేదీన జరిగింది. నాలుగు రోజుల క్రితం ఇస్రాలాబాద్ గ్రామంలో బంధువుల ఇంటికి అఖిల వెళ్లింది. భర్త భాగయ్య బంగారు గొలుసు కనిపించడం లేదని భార్య అఖిలకు ఫోన్ చేశారు. తాను తీసుకెళ్లలేదని బదులిచ్చింది. దీంతో అఖిలను బంధువుల ఇంటి భర్త భాగయ్య బుధవారం పన్యాలకు తీసుకొచ్చాడు. అత్తింటివారు మందలించారో తెలియదుగానీ గురువారం సాయంత్రం అత్తగారింట్లో అఖిల మృతదేహం వేలాడుతూ కనిపించింది. దీంతో భర్త భాగయ్య, కుటుంబీకులు మృతదేహాన్ని మంచంపై పండబెట్టారని గ్రామస్తులు తెలిపారు. ఆత్మహత్య చేసుకుందా, లేకపోతే హత్య చేశారో తెలియదు. విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ వేణుకుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పన్యాల గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బంగారం కోసమే తన కూతురిని హత్య చేశారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

భర్త వేధింపులతోనే ఆత్మహత్య: ఎస్ఐ

బంగారం గొలుసు తీశావని భర్త వేధింపులతోనే అఖిల ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. భర్త వేధించడం వల్ల అవమానం భరించలేక అఖిల ఆత్మహత్య చేసుకున్నట్టు రాసిన సూసైడ్ నోట్ కూడా దొరికిందని ఎస్ఐ తెలిపారు. మతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.